## ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలి

- తనిఖీలపై నోడల్ ఆఫీసర్ ప్రకాశ్‌రెడ్డి

సిటీబ్యూరో, అక్టోబర్ 30 (నమస్తే తెలంగాణ): ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించేందుకు స్టాస్టిక్ సర్వేలెన్స్ టీమ్‌లు తనిఖీల సందర్భంగా ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని ఎంసీసీ నోడల్ ఆఫీసర్, ఈవీడీఎం డైరెక్టర్ ప్రకాశ్‌రెడ్డి తెలిపారు. సోమవారం జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో స్టాస్టిక్ సర్వేలెన్స్ బృందాలకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంసీసీ నోడల్ ఆఫీసర్ ప్రకాశ్‌రెడ్డి మాట్లాడుతూ.. నవంబర్ 3 నుంచి సంబంధిత నియోజకవర్గాల్లో ఎస్‌ఎస్‌టీ టీమ్‌లు తమ విధులను నిర్వర్తించాలని తెలిపారు. ప్రతిరోజు మూడు షిఫ్ట్‌ల్లో 24 గంటల పాటు పనిచేయాలన్నారు. విధుల్లో ఉన్న సమయంలో వీడియో గ్రఫీ ద్వారా తమ పేరు, లొకేషన్ నమోదు చేయాలని సూచించారు. తనిఖీలకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు పంపించాలని తెలిపారు. స్టాస్టిక్ టీమ్‌ల వాహనాలకు జీపీఎస్, సీసీ కెమెరాలు అమర్చి ఉంటాయన్నారు. ఎలక్షన్ సంబంధిత నగదు, బంగారం, లిక్కర్‌ను సీజ్ చేస్తే.. ఎస్‌హెచ్‌ఓ ద్వారా రిటర్నింగ్ అధికారికి సమర్పించాలని తెలిపారు. హైదరాబాద్ జిల్లా గ్రీవెన్స్ సెల్ ద్వారా సీజ్ చేసిన నగదుకు సంబంధించిన డాక్యుమెంట్లను పరిశీలించి రిలీజ్ చేస్తారని తెలిపారు. ఓటర్లను మభ్యపెట్టేందుకు ఉచితంగా అందజేసే సామగ్రిపై నిఘా ఉంచాలని తెలిపారు. పట్టుబడ్డ నగదుకు తప్పనిసరిగా రిసిప్ట్‌ను అందజేయాలని, లేనిచో వారిపై ఎన్నికల సంఘం కఠిన చర్యలు తీసుకుంటుందని తెలిపారు. అడిషనల్ సీపీ విక్రమ్‌సింగ్ మాన్ మాట్లాడుతూ.. పోలింగ్‌కు 48 గంటల ముందు సభలు, సమావేశాలపై నిషేధం ఉంటుందని తెలిపారు. ఎంసీసీలో భాగంగా ఎవరి ఇంట్లోనైనా నగదు ఉన్నట్టు సమాచారం అందినా.. ఆ సమాచారాన్ని ఐటీ అధికారులకు తెలియజేయాలన్నారు. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించిన వారిపై ఆర్‌పీ యాక్ట్ 1951, ఇండియన్ పీనల్ కోడ్ ప్రకారం చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. నోడల్ ఆఫీసర్ అకౌంట్ శరత్‌చంద్ర మాట్లాడుతూ.. ఎంసీసీలో భాగంగా ఎస్‌ఎస్‌టీలు సీజ్ రికార్డును తప్పనిసరిగా చేయాలన్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో ఎస్‌ఎస్‌టీ టీమ్‌లు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రేవంత్‌రెడ్డి హఠావో.. కాంగ్రెస్‌కు బచావో..

- అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన... వాల్ పోస్టర్ విడుదల
- రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపడుతాం
- బహిష్కృత నేత, టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ కురువ విజయకుమార్



రేవంత్ రెడ్డి హఠావో.. కాంగ్రెస్‌కు బచావో.. వాల్ పోస్టర్‌ను విడుదల చేస్తున్న బహిష్కృత నేత, టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ కురువ విజయ కుమార్, తదితరులు

కవాడిగూడ, అక్టోబర్ 30: తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ఇప్పటి వరకు కేటాయించిన 100 సీట్లలో టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి దాదాపు 50కి పైచిలుకు ప్యారాచూట్ నేతలకు టికెట్లు అమ్ముకున్నారని బహిష్కృత నేత, టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ కురువ విజయకుమార్ ఆరోపించారు. ఈ విషయంలో స్పష్టమైన ఆధారాలతో తాము పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకెళ్లామని ఆయన వెల్లడించారు. ఈ మేరకు సోమవారం లోయర్ ట్యాంక్‌బండ్ లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద 'నాడు ఓటుకు నోటు– నేడు ఎమ్మెల్యే సీట్లకు కోట్లు' అంటూ.. ఎమ్మెల్యే సీట్లను కోట్ల రూపాయలకు అమ్ముకుంటూ పార్టీని నాశనం చేస్తున్న టీ పీసీసీ అధ్యక్షుడు 'రేవంత్ రెడ్డి హఠావో, కాంగ్రెస్‌కు బచావో' నిజమైన కాంగ్రెస్ వాదులారా, ప్యారాచూట్ ఎమ్మెల్యే అభ్యర్థులను ఓడగొడుదాం.. మన అస్తిత్వాన్ని కాపాడుకుందాం.. అంటూ పెద్ద ఎత్తున నిరసన వ్యక్తం చేశారు. అనంతరం రేవంత్‌రెడ్డి అక్రమంగా టికెట్ల అమ్మకాన్ని నిరసిస్తూ రేవంత్ రెడ్డి హఠావో.. కాంగ్రెస్‌కు బచావో.. అనే వాల్ పోస్టర్‌ను పలువురు నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తనను ఎలాంటి సంజాయిషీ లేకుండా పార్టీ నుంచి సస్పెండ్ చేయడం ఎంత వరకు సమంజసమని మండిపడ్డారు. రేవంత్ రెడ్డి టికెట్లు అమ్ముకొని నిజమైన కార్యకర్తలకు తీవ్ర అన్యాయం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. తెలుగుదేశం పార్టీ నుంచి వచ్చిన వారికి, వ్యాపారవేత్తల నుంచి కోట్ల రూపాయలు తీసుకొని టికెట్లు అమ్ముకున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రకటించిన రెండు జాబితాల్లో నిజమైన కార్యకర్తలకు అన్యాయం జరిగిందని మండిపడ్డారు. 65 కాంగ్రెస్ సీట్లను రూ. 600 కోట్లకు అమ్ముకున్నారని ఆరోపించారు. అన్ని గ్రామాల్లో పర్యటించి రేవంత్ రెడ్డి కుట్రలను ఎండగడుతామని హెచ్చరించారు. రేవంత్ రెడ్డి హఠావో.. కాంగ్రెస్ బచావో.. అనే నినాదంతో ముందుకు వెళ్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో బాబా ఖలీముద్దీన్, తిమ్మయ్య, పోతు మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

# నామినేషన్లకు ఏర్పాట్లు చేయాలి

- జిల్లా కలెక్టర్ గౌతమ్



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్

మేడ్చల్, అక్టోబర్ 30 (నమస్తే తెలంగాణ): మేడ్చల్– మల్కాజిగిరి జిల్లాలో నామినేషన్ల ప్రక్రియకు అన్ని రకాల ఏర్పాట్లు చేయాలని, ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు నామినేషన్లను స్వీకరించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ ఆదేశించారు. జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశపు హాల్‌లో సోమవారం జిల్లా అదనపు కలెక్టర్లు విజయేందర్‌రెడ్డి, అభిషేక్ అగస్త్యతో కలిసి కలెక్టర్ ఆర్వోలు, ఈఆర్వోలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల ప్రక్రియ త్వరలోనే ప్రారంభం కానున్నదని తెలిపారు. ఈ నేపథ్యంలో ఐదు నియోజకవర్గాల రిటర్నింగ్ కార్యాలయాల వద్ద నామినేషన్లకు సంబంధించి పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేయాలన్నారు. నామినేషన్లు స్వీకరించే మొదటి రోజు నుంచి ప్రక్రియ ముగిసే వరకు 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. ప్రతిరోజు ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ట్రాఫిక్ ఆంక్షలు అమలు చేయాలన్నారు.

### అత్యవసర సేవల పరిధిలోని శాఖలకు పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం

అత్యవసర సేవల పరిధిలోని శాఖలకు పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ గౌతమ్ తెలిపారు. పోస్టల్ బ్యాలెట్‌కు సంబంధించి నవంబర్ 7వ తేదీ వరకు దరఖాస్తులు సమర్పించాలన్నారు. ఇందులో భాగంగా 13 శాఖలకు సంబంధించి బ్యాలెట్ ఓట్లు వేసేందుకు ప్రత్యేకంగా అవకాశం ఉన్నదన్నారు. ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా, ఫుడ్ కార్పొరేషన్, భారతీయ రైల్వే, ప్రెస్ ఇన్‌ఫర్మేషన్ బ్యూరో, దూరదర్శన్, ఆలిండియా రేడియో, విద్యుత్ శాఖ, ఆరోగ్యం, కుటుంబ సంక్షేమం, రాష్ట్ర రవాణా సంస్థ, ఆహారం, పౌరసరఫరాలు, బీఎస్‌ఎన్‌ఎల్, పోల్ డే కవరేజ్, ఈసీఐ ద్వారా అనుమతి పొందిన మీడియా వ్యక్తులు, అగ్నిమాపక సేవలు, తదితర శాఖల్లో విధులు నిర్వర్తిస్తూ.. ఓటు హక్కును వినియోగించుకోలేని వారు మాత్రమే దరఖాస్తులను ఫారం(12–డీ) లో తమ పూర్తి వివరాలతో రిటర్నింగ్ అధికారులకు సమర్పించాలన్నారు. దరఖాస్తుల స్వీకరణ అనంతరం అర్హత గల ఓటర్ల జాబితాను తయారు చేసి, వారికి పోస్టల్ బ్యాలెట్ పత్రాలను అందజేస్తారని కలెక్టర్ వెల్లడించారు. ఈ సమావేశంలో డీఆర్వో హరిప్రియ పాల్గొన్నారు. ఇదిలా ఉండగా.. డిప్యూటీ ఎన్నికల కమిషనర్ నితేశ్ వ్యాస్ ఢిల్లీ నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ గౌతమ్ పాల్గొన్నారు. కలెక్టర్‌తో పాటు అదనపు కలెక్టర్లు విజయేందర్‌రెడ్డి, అభిషేక్ అగస్త్య, జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియ, డీసీబీ శబరీశ్ తదితరులు పాల్గొన్నారు.

## 'నోటా'కు గుర్తు.. తొలిసారి కేటాయింపు




మియాపూర్, అక్టోబర్ 30: నోటాకు కూడా ఈ ఎన్నికల్లో తగిన గుర్తు లభించింది. తొలిసారిగా ఎన్నికల సంఘం నోటాకు కూడా గుర్తును కేటాయించింది. కంట్రోల్ యూనిట్‌లో ఉన్న పోటీలోని అభ్యర్థుల వరుస సంఖ్య చివర 16వ గుర్తుగా నోటా ఉంటున్న విషయం తెలిసిందే. ఈ సారి జరిగే ఎన్నికల్లో నోటాకు ప్రత్యేక గుర్తును ఎన్నికల సంఘం కేటాయించింది. 2013లో తొలిసారిగా నోటాను ఎన్నికల సంఘం అమలులోకి తెచ్చింది. పోటీ చేసే అభ్యర్థులెవరూ నచ్చని పక్షంలో నోటాకు ఓటు వేసే అవకాశాన్ని ఎన్నికల సంఘం ఓటరుకు కల్పించింది. నోటా ప్రవేశపెట్టిన నాటి నుంచి బ్యాలెట్ యంత్రంపై 'నోటా' అనే ఆంగ్ల అక్షరాన్ని ముద్రించి ఉండేది. అయితే, వచ్చే నెల 30న జరగనున్న అసెంబ్లీ ఎన్నికలలో తొలిసారిగా ఎన్నికల సంఘం నోటాకు కూడా ఓ గుర్తును కేటాయించింది. ఈ గుర్తుపై ఓటర్లకు అవగాహన కల్పించాలని ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు శేరిలింగంపల్లి నియోజకవర్గంలో ఎన్నికల అధికారులు తగిన చర్యలు తీసుకుంటున్నారు. ఓటింగ్ ప్రక్రియపై అవగాహన కల్పించేందుకు గత నెలలో ఎన్నికల అధికారులు వీవీ ప్యాట్స్‌తో ప్రజల మధ్యకు వెళ్లిన విషయం తెలిసిందే. ఈ సందర్భంలోనే నోటాపై ఓటర్లకు అవగాహన కల్పించారు. ఇదిలా ఉండగా.. గత ఎన్నికలలో శేరిలింగంపల్లి నియోజకవర్గంలో నోటాకు 3500 వరకు ఓట్లు పడ్డాయన్న విషయాన్ని అధికారులు గుర్తు చేశారు.

# అసెంబ్లీ ఎన్నికలకు అంతా సిద్ధం


- జిల్లా ఎన్నికల అధికారి రొనాల్డ్ రాస్
- కేంద్ర ఎన్నికల సంఘం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జీహెచ్‌ఎంసీ కమిషనర్

సిటీబ్యూరో, అక్టోబర్ 30 (నమస్తే తెలంగాణ) : రానున్న అసెంబ్లీ ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించేందుకు అంతా సిద్ధం చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్‌ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రాస్ వివరించారు. తెలంగాణలో జరిగే అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో కేంద్ర ఎన్నికల కమిషన్ (ఈసీఐ) సీనియర్ డిప్యూటీ ఎన్నికల కమిషనర్ నితేష్‌కుమార్ వ్యాస్, డైరెక్టర్ ఎలక్షన్ ఎక్స్‌పెండేచర్ పంకజ్ శ్రీవాత్సవ, తెలంగాణ సీఈవోతో కలిసి సోమవారం అన్ని జిల్లాల ఎన్నికల అధికారులతో న్యూఢిల్లీ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల ఏర్పాట్లపై జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్‌ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రాస్ మాట్లాడుతూ.. నగదు, ఆభరణాలు, మద్యం, గంజాయి, మత్తు పదార్థాలను పట్టుకోవడానికి నియోజకవర్గానికి మూడు బృందాలు ఏర్పాటు చేశామన్నారు. 24 గంటల పాటు నిఘా ఉండేందుకు ప్రత్యేకంగా 105 బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అలాగే. వారికి తగిన శిక్షణ కూడా ఇచ్చామన్నారు. ఈ బృందాల్లో కేంద్ర బలగాలు కూడా ఉన్నాయని తెలిపారు. డైరెక్టర్ పంకజ్ శ్రీవాత్సవ మాట్లాడుతూ.. నగదు, సొత్తు సీజ్ చేయడంతో ప్రజలు ఇబ్బంది పడకుండా ఉండేందుకు జిల్లా ఫిర్యాదుల కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రజలకు ఇబ్బంది కలుగకుండా విచారణ చేసి.. రోజువారీగా విడుదలకు చర్యలు తీసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో హైదరాబాద్ సీపీ సందీప్ శాండిల్య, అదనపు సీపీ విక్రమ్ సింగ్ మాన్, జిల్లా కలెక్టర్, డిప్యూటీ ఈవో అనుదీప్ దురిశెట్టి, అడిషనల్ కమిషనర్ శంకరయ్య, అడిషనల్ కమిషనర్ స్నేహ శబరిస్, డిప్యూటీ కలెక్టర్ తదితరులు పాల్గొన్నారు.

వీడియో కాన్ఫరెన్స్‌లో తొలుత కేంద్ర ఎన్నికల అధికారి నితేష్ కుమార్ వ్యాస్ మాట్లాడుతూ.. నవంబర్ 3 నుంచి నామినేషన్ల దాఖలు చేసే అవకాశం ఉన్నదన్నారు. ఈ మేరకు ఆర్వో కార్యాలయం వద్ద లా అండ్ ఆర్డర్ సమస్య రాకుండా చూడాలన్నారు. ఎన్నికల నిర్వహణకు కావాల్సిన పోలింగ్ అధికారులు, సిబ్బంది, ప్రభుత్వ ఉద్యోగులను నియమించి తొలిసారి శిక్షణ ఇచ్చామన్నారు. 80 సంవత్సరాలు పైబడిన వారికి ఇంటి వద్దనే ఓటు వేసే ప్రక్రియలో భాగంగా.. చర్యలు తీసుకోవాలన్నారు. ఆర్వో గదిలో సీసీ టీవీలను ఏర్పాటు చేసి, డిప్యూటీ ఎన్నికల అధికారి పర్యవేక్షణ చేయాలన్నారు. ఈ నెల 31 లోగా సీసీటీవీ, వీడియోగ్రఫీ, వాల్ క్లాక్‌లు ఏర్పాటు చేయాలన్నారు.

# అనుమతులకు.. ఆర్‌ఓకు దరఖాస్తు చేసుకోవాలి

- రాచకొండలో 3,326 పోలింగ్ బూత్‌లు
- రూ. 36 కోట్ల సొత్తు సీజ్: రాచకొండ సీపీ డీఎస్. చౌహాన్



సిటీబ్యూరో, అక్టోబర్ 30 (నమస్తే తెలంగాణ): రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలో చేపట్టిన తనిఖీల్లో ఇప్పటి వరకు రూ. 36 కోట్ల సొత్తు పట్టుబడిందని కమిషనర్ డీఎస్ చౌహాన్ వెల్లడించారు. సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన ఎన్నికలకు సంబంధించిన బందోబస్తును వివరించారు. కమిషనరేట్ పరిధిలోని 13 నియోజకవర్గాలు ఉండగా.. మొత్తం 3,326 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయన్నారు. 8 నియోజకవర్గాలకు సంబంధించిన నామినేషన్ కేంద్రాలు (ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయాలు) రాచకొండ పరిధిలోకి వస్తాయని, అక్కడ పటిష్ట భద్రత ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎన్నికల ప్రచారం, ఇతర అంశాలకు సంబంధించిన అనుమతుల కోసం ఎన్నికల రిట్నరింగ్ అధికారి (ఆర్‌ఓ)కి 48 గంటల ముందు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఏసీపీ స్థాయిలోని నోడల్ అధికారి పరిశీలన తరువాత అనుమతులు జారీ చేస్తారన్నారు. ఇందుకు సీ విజిల్ యాప్‌ను కూడా ఉపయోగించుకోవచ్చన్నారు. కమిషనరేట్ పరిధిలో 19 చెక్ పోస్టులు, 24 గంటల పాటు మూడు షిఫ్టుల్లో సిబ్బంది పనిచేస్తున్నారన్నారు. ప్రతి నియోజకవర్గానికి 3 ఫ్లైయింగ్ స్క్వాడ్స్ ఏర్పాటు చేశామన్నారు. ఎన్నికల నేపథ్యంలో నిర్వహిస్తున్న తనిఖీల్లో రూ. 36 కోట్ల విలువైన సొత్తు పట్టుబడినట్టు తెలిపారు.